# జేఎన్‌టీయూ విద్యార్థి శైలజకు డాక్టరేట్

**నవతెలంగాణ- ఎల్బీనగర్**



జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న శైలజ డాక్టరేట్ సంపాదించారు. జేఎన్‌టీయూలో శైలజ కంప్యూటర్ సైన్స్ విద్యను అభ్యసిస్తున్నది. చదువులో ఎంతో ప్రతిభ కనబరిచిన శైలజ డాక్టరేట్ పట్టాను గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. శైలజ తన తల్లిదండ్రులు పోకల రాము రాజేశం, వరలక్ష్మితో కలిసి చైతన్యపురిలో నివాసం ఉంటున్నది. తమ కూతురు డాక్టరేట్ సంపాదించడం తమకెంతో ఆనందాన్ని కలిగించిందని తల్లిదండ్రులు తెలిపారు. పట్టుదలతో చదువుతే ఏదైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

# ఫ్యాక్ట్ ఫైండింగ్ పరిశీలనకు జేఎన్‌టీయూను ఆదేశించండి

- గవర్నర్‌కు మహబూబ్ కాలేజ్ కమిటీ సభ్యుల వినతి



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన మహబూబ్ కాలేజ్ కమిటీ సభ్యులు

**హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):** మహబూబ్ కాలేజ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్వీఐటీ)లో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ పరిశీలన జరిగేలా జేఎన్‌టీయూకు ఆదేశాలు ఇవ్వాలని మహబూబ్ కాలేజ్ కమిటీ సభ్యులు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్వీఐటీలో ప్రస్తుతం 1,800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సహకరించాలని కోరారు. వెంకటనారాయణ ఎడ్యుకేషన్ సొసైటీతో తాము ఒప్పందాన్ని రద్దు చేసుకున్నామని, దీనికి సంబంధించిన పత్రాలు జేఎన్‌టీయూకు సమర్పించామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా, వివాదాన్ని సాకుగా చూపుతూ జేఎన్‌టీయూ అధికారులు 2025-26 విద్యా సంవత్సరానికి అనుమతులకు సంబంధించి ఫ్యాక్ట్ ఫైండింగ్ పరిశీలనకు నిరాకరించారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మహబూబ్ కాలేజ్ కమిటీ ప్రెసిడెంట్ పీఎల్. శ్రీనివాస్, సభ్యులు ఎంవీ. రవీంద్రనాథ్, డాక్టర్ ఎస్. ప్రేమ్‌నారాయణ్, ఎన్. నరేష్ కుమార్, భగవత్ వారణాసి, డాక్టర్ కె. అనిల్ కుమార్ ఉన్నారు.

# జేఎన్‌టీయూలో బదిలీలు, నియామకాలు

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** జేఎన్‌టీయూలో సోమవారం 8 మంది అధ్యాపకులు, అసోసియేట్ అధ్యాపకులను బదిలీ చేస్తూ.. పలువురిని వివిధ హోదాల్లో నియమిస్తూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీ పరీక్షల విభాగంలో అదనపు కంట్రోలర్‌గా ఉన్న డాక్టర్ ఎం.శైలజను సుల్తాన్‌పూర్ కళాశాల మెకానికల్ విభాగానికి బదిలీ చేశారు. సుల్తాన్‌పూర్ మెకానికల్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ కె.ప్రసన్నలక్ష్మిని వర్సిటీ పరీక్షల విభాగంలో అదనపు కంట్రోలర్‌గా నియమించారు. అఫిలియేషన్, అకడమిక్ ఆడిట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.శ్వేతను జగిత్యాల కళాశాల సీఎస్ఈకి. ఇదే విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ పి.ప్రసన్నను వర్సిటీ కళాశాల మెకానికల్ విభాగానికి బదిలీ చేశారు. ప్రసన్న పీఆర్వో బాధ్యతలను యదావిధిగా నిర్వహిస్తారు. ప్రవేశాల విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎల్.సైదాను బయోటెక్నాలజీ విభాగానికి.. వర్సిటీ పరీక్షల విభాగంలో అదనపు కంట్రోలర్లుగా పనిచేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నీరజను సీఎస్ఈకి.. డాక్టర్ ఎన్.దర్గకుమార్‌ను వర్సిటీ కళాశాల సివిల్ విభాగానికి బదిలీ చేశారు. వర్సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సపోర్ట్, డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ జి.ప్రవీణ్‌బాబును వర్సిటీ పరీక్షల విభాగం అదనపు కంట్రోలర్‌గా నియమించారు.

